

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండుగ

**కామెడీ క్లబ్ కథలు** **మల్లాది వెంకట కృష్ణమూర్తి**

## మత్తు దిగిపోయాక..!

ఆపరేషన్ అయిన భర్తని చూడటానికి వెళ్ళింది ఓ భార్య.

మత్తు మందులోంచి అప్పుడే బయటికి వచ్చిన అతను తన భార్యవంక చూస్తూ చెప్పాడు

"నువ్వెంత అందగత్తెవి" మత్తులోకి వెళ్ళిపోయి, కాస్సేపాగి మళ్ళీ కళ్ళుతెరిచి చూసి తన భార్యతో చెప్పాడా భర్త.

"నీవు సౌందర్య రాశివి"

అంతలోనే అతని కళ్ళు మత్తువల్ల మూతలు పడ్డాయి.

తన భర్త పొగడ్తలకి సంతోషపడ్డ భార్య భర్త మంచం పక్కనే కూర్చుంది. అతనికి పూర్తిగా మత్తు దిగిపోయాక చెప్పాడు

"కాసిన్ని మంచినీళ్ళివ్వు.."

మళ్ళీ తన భర్త తనని పొగడక పోవడంతో నిరాశ పడి భర్తకు మంచినీళ్ళిచ్చాక అడిగింది

"నా అందం వూసెత్తరే?"

"మత్తు మందు పూర్తిగా దిగిపోయింది" జవాబు చెప్పాడా భర్త...!!

**

# వైద్యో నారాయణ హరీ..! ..

యర్రంశెట్టి శాయి

రైల్లో జ్వరం వచ్చేసింది రంగారావుకి.

నాంపల్లి స్టేషన్‌లో దిగగానే ఓ పెద్దమనిషిని ఆ ప్రాంతంలో మంచి డాక్టరు ఎవరని అడిగాడు.

"డాక్టరా? పరలోకరావు నిజంగా మాంఛి డాక్టరు! ఓ సారి నా ప్రాణం పోతున్న సమయంలో కాపాడాడు.."

"ఎలా?" ఆసక్తితో అడిగాడు రంగారావు.

"ఎలాగేముందీ? ఇలాగే నాకు జ్వరం వస్తే పరలోకరావు దగ్గరకెళ్ళి చూపించుకున్నాను. ఆయన ఇచ్చిన మందులు రెండురోజులు వాడాక పరిస్థితి దారుణమయి నన్ను క్రింద పడుకోబెట్టారు. అప్పుడు ఆయన కోసం మళ్ళీ కబురు చేశారు గానీ అదృష్టవశాత్తూ లేరు. నేను బతికి బట్టకట్టాను.."

***

**కృష్ణుడు** తన భార్య సత్యభామను తీసుకుని ఫేమిలీ ప్లానింగ్ క్లినిక్‌కి వెళ్ళాడు.

"మాకు నిన్నే పెళ్ళయింది డాక్టర్ గారూ! మరి ఖచ్చితమయిన కుటుంబ నియంత్రణ పద్ధతేదో చెబితే అవలంభిస్తాము" అన్నాడు కృష్ణుడు డాక్టరుతో.

డాక్టరు గారు టేబిల్ మీదవున్న మెడికల్ పుస్తకాలు, పత్రికలు గంటసేపు చదివాడు.

"ఆల్ రైట్! రోజుకొక యాపిల్ పండు తినండి" అన్నాడు వాళ్ళతో.

వాళ్ళిద్దరూ ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ పొంగిపోయారు.

"ఏమిటి? ఇంత తేలికన్నమాట! అయితే యాపిల్ తినాల్సింది ముందా, తరువాతా?" అడిగారు కృష్ణుడు దంపతులు.

"ముందూ తరువాతా కాదు..దాని బదులుగా..!" తాపీగా చెప్పాడు డాక్టర్.

***

**వెటర్నరీ** డాక్టర్ ఇంట్లో ఫోన్ మోగింది.

"హలో! డాక్టర్ మా కుక్క పిల్లను తేనెటీగ కుట్టి బాధపడుతోంది. పాపం..ఏం చెయ్యమంటారు?" అడిగిందావిడ.

"కుట్టినచోట వెచ్చని సోడా నీళ్ళతో కడగండి" చెప్పాడు డాక్టర్.

అరగంట తర్వాత డాక్టర్ నిద్రపోతుంటే మళ్ళీ ఫోన్ మోగింది.

"డాక్టర్ గారూ..పాపం కుక్కపిల్ల ఇంకా బాధపడుతోందండీ..పోనీ దానికి నిద్రమాత్ర వెయ్యమంటారా?"

"ఓ..భేషుగ్గా వెయ్యండి.అన్నట్లు మీరుకూడా రెండు వేసుకోండి.."

అన్నాడు డాక్టర్ ప్రశాంతంగా..

***

ఓ పెద్ద మనిషిని ఓవర్ స్పీడ్ తో కారు నడుపుతున్నందుకు గాను కోర్టులో నిలబెట్టారు పోలీసులు.

"బాబోయ్! పోలీసులు చెప్పేదంతా అబద్ధమండీ! నేను గంటకు పదిహేను కిలోమీటర్ల కంటె ఎక్కువ స్పీడుతో నడపలేదండి.." అంటూ మేజిస్ట్రేటు గారితో మొత్తుకున్నాడా పెద్దమనిషి.

"పదిహేను కిలోమీటర్ల కంటె ఎక్కువ లేదని ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావు?" అడిగాడి మేజిస్ట్రేటు.

"భలేవారండి.. నేను పన్ను పీకుంచుకోడానికి డాక్టర్ దగ్గర కెళుతున్నా కదా మరి..!"

***

**డాక్టర్ :** చూడు మిస్టర్,ఇవాళ్టినుంచి నువ్వు త్రాగుడు, సిగరెట్లు ఖరీదయిన తిండి మానెయ్యాలి. రోజుకొక పూటే భోజనం చేయాలి. సినిమాలు అస్సలు చూడకూడదు. పేకాట, రేసులు ఆడకూడదు.

**రోగి:** ఇవన్నీ చేస్తే నా జబ్బు తగ్గిపోతుందా డాక్టర్ గారూ?

**డాక్టర్:** ఇవన్నీ నీ జబ్బు తగ్గేందుకు కాదు చెప్పటం.. నువ్వు నాకు బిల్లు కట్టకలిగేందుకు తగిన స్థోమత ఏర్పడుతుంది. అది ఏర్పడగానే నీకు ట్రీట్‌మెంట్ మొదలు పెడతాను..

***

## చౌ..చౌ ఏరుకొచ్చిన నవ్వులు

"ఆఫీసు పనిమీద వారం క్రితం ఊరెళ్ళా. నిన్న వస్తున్నట్లు ఎస్ ఎమ్ ఎస్ పంపా. తీరా నేను వచ్చేసరికి మా ఆవిడ తన బాయ్ ఫ్రెండ్‌తో బెడ్ రూమ్‌లో ఉంది. ఎందుకిలా జరిగింది?" బాధతో చెబుతున్నాడు జంబులింగం స్నేహితుడు.

"అంత ఫీలవకురా ..పాపం.. తను నీ మెసేజ్ చూసుకుని ఉండదు.." ఓదార్చాడు జంబులింగం!

***

"చాలాకాలం తర్వాత నా భార్య నేను చెప్పిన మాట విన్నదోయ్.." ఆనందంగా అన్నాడు మిత్రునితో వెంగళప్ప.

"ఏం విన్నదేంటి?"

"రాత్రి ఇంటికి నిప్పంటుకుని తగలబడుతోంది. ఇంట్లోనే ఉంటే కాలిపోతావ్, బయటకు వచ్చెయ్యమన్నా. వెంటనే వచ్చేసింది.." చెప్పాడు జంబులింగం.

***

"చాలా పెద్ద యాక్సిడెంట్ అయిందటగదా..ఇంతకీ దెబ్బలేమన్నా తగిలాయా?" జంబులింగాన్ని అడిగాడు ఫ్రెండ్

"లేదు ఏమీ తగల్లా.."

"మరైతే బ్యాండేజీలేమిటి?"

"చూడ్డానికి వచ్చిన ప్రతి ఒక్కళ్ళూ దెబ్బలేం తగల్లేదా? అని అడుగుతుంటే తట్టుకోలేక రెండు కట్లు కట్టించుకున్నా" చెప్పాడు జంబులింగం..!

***

"సర్.. మా లాయర్ కు ఒంట్లో బాగా లేక కోర్టుకి రాలేకపోయాడు. దయచేసి నా కేసుని వాయిదా వేయగలరా?" జడ్జిని అడిగాడు నిందితుడు.

"ఇందులో వాయిదా వేయడానికే ముంది? నువ్వు జేబుకొడుతూ రెడ్ హ్యేండెడ్‌గా దొరికిపోయావు కదా!?"

"అదంతా నాకూ తెలుసు సార్. నేను రెడ్ హేండెడ్‌గా దొరికిపోయానని తెలిసినా లాయర్ గారు కేసుని ఎలా వాదిస్తారో చూడాలని ఉంది. అందుకే వాయిదా వేయమనేది.." అన్నాడు నిందితుడు.

***

"**డాక్టర్** మీరిచ్చిన సలహా వల్ల ఇబ్బందిగా ఉంది" అన్నాడు జంబులింగం.

"ఏమైంది?"

"సిగరెట్లు మానేసి చూయింగ్ గమ్ వాడమన్నారు కదా! ఎంత వెలిగించినా చూయింగ్ గమ్ అస్సలు అంటుకోవడం లేదు.." విసుగ్గా చెప్పాడు జంబులింగం.

***

"**నాన్నా** స్కూల్లో ఆటల పోటీలు జరుగుతున్నాయి. ఈ సారి కప్పులన్నీ నాకే" గర్వంగా చెప్పాడు వాళ్ళబ్బాయి సోమలింగం

"అన్నీ కప్పులే ఎలాగ..సగం సాసర్లు కూడా గెలుచుకురా.." సలహా ఇచ్చాడు వెంగళప్ప.

***

"**ఏప్రిల్ ఫూల్**" బస్ కండక్టర్‌తో హేళనగా అన్నాడు జంబులింగం.

"ఎందుకు?" అడిగాడు కండక్టర్

"నా దగ్గర పాస్ ఉన్నా..నేను మళ్ళీ టిక్కెట్ తీసుకున్నా..అందుకని!" అసలు విషయం చెప్పాడు జంబులింగం.

***

"**ఏంటీ తలంతా** బొప్పి కట్టి వాచిపోయింది?" జంబులింగాన్ని ఫ్రెండ్ అడిగాడు.

"ఆఁ..ఏం లేదు. గోడమీద వాలిన దోమల్ని రాళ్ళతో కొడదామని ట్రై చేస్తుంటే..బుర్ర ఉపయోగించమని సలహా ఇచ్చింది..మా ఆవిడ.."

***